# బుట్టబొమ్మ

-ఎన్.శివనాగేశ్వరరావు

సాయం సమయం అయింది. మల్లి కళ్లు ఇంకా రాని ఆ కాలేజి అమ్మాయికోసం ఎదురు చూస్తున్నాయి. 'ఈపాటికి రావాలి! ఎందుకు రాలేదా?' అని తనలో తానే రెండు, మూడుసార్లు అనుకుంది.

సరిగ్గా టైం ఎంత అయిందో చూడ్డానికి ఆ పిల్లదగ్గర వాచీ లేదు. వచ్చే పోయే బస్సులను బట్టి టైం అంచనావేసింది. అంతలో దూరంగా కనిపించిందా అమ్మాయి. మెల్లగా అటే నడిచి వస్తున్నది. పింక్ కలర్ చుడీదార్‌లో గులాబీపూవులా ఉందా అమ్మాయి. ఆ అమ్మాయిని చూడగానే మల్లి కళ్లు మెరిశాయి.

'ఎంత అందంగా ఉంది! ఎంత సుకుమారంగా ఉంది! ఏ డ్రెస్ వేసుకున్నా మెరిసిపోతూనే ఉంటుంది. ఆ నడక ఎంత బాగుంటుంది' అనుకుంది మల్లి. ఆ కాలేజ్‌లో అమ్మాయిని చూసిన ప్రతిసారీ మల్లి మనసులో అనుకునే మాటలు ఇవే!

నాలుగు రోడ్ల కూడలి దగ్గర మల్లి తోపుడు బండి పెట్టుకుని సీజనల్ ఫ్రూట్స్ అమ్ముతుంటుంది. జామ పళ్లు, అరటి పళ్లు, యాపిల్స్, బత్తాయిలు ఏవి ఎక్కువగా మార్కెట్‌లోకి వస్తుంటే అవి అమ్ముతుంటుంది.

మల్లి వయసు పదహారు. తల్లి జబ్బుచేసి చనిపోయింది. తండ్రి తాగుబోతు. అసలు బాధ్యత ఎరగని మూర్ఖుడు. తల్లిలేని పిల్ల అయినా మల్లిపట్ల ఏమాత్రం జాలి చూపించేవాడు కాదు. తిన్నదో, లేదో కూడా పట్టించుకునేవాడు కాదు.

కడుపులో ఆకలి మెలితిప్పుతుంటే మరొకరైతే అడుక్కునే వారేమో. మల్లిమాత్రం ఒక ఇంట్లో పాచిపని చేయడానికి కుదిరింది. ఆ పని దాని కడుపు నింపింది. అప్పుడు మల్లికి పదేళ్లు.

అలా రెండేళ్లు గడిచాయి. ఇంటెడు చాకిరీ చేయించుకుని కడుపునిండా తిండి పెట్టని అమ్మగార్లను, చిన్నపిల్లని ప్రేమ చూపించకుండా దగ్గరకు పిలిచి ఎక్కడెక్కడో తడిమే అయ్యగార్లను చాలామందిని చూసింది. తన తండ్రిలాంటి వాళ్లు అలా నీచంగా ప్రవర్తిస్తుంటే ఆ పిల్లకు అసహ్యం వేసేది.

తనపట్ల కాసింత ప్రేమ చూపించే అవ్వతో తన బాధ చెప్పుకుంది. "మల్లీ! మగాడి బుద్దే అంత. అవి పట్టించుకుంటే పూట గడవదు. అలాగని వాళ్ళను ఊరికనే వదలకు. తిన్నగా లేకపోతే అమ్మగారికి చెప్తా! అని బెదిరించు. వెధవలు దారికి వస్తారు" అని చెప్పింది. ఆమాట మంత్రంలా పనిచేయడంతో మల్లి ఊపిరి పీల్చుకుంది. అంతలో మల్లికి పదహారేళ్లు వచ్చాయి. అందం రేకులు విప్పింది. దాని బాధలు మరింత ఎగా పెరిగాయి.

అయితే మగాళ్ళంతా అలాగే ఉండరని ఒక మహానుభావుడు మల్లి మనసులోపడిన చెడు ముద్రను చెరిపేసాడు.

అతని పేరు జగన్నాథ్. స్కూల్ టీచర్‌గా పని చేస్తున్నాడు. ఇంకా పెళ్లి కాలేదు. అతనింట్లో పనికి కుదిరినప్పుడు మల్లి చాలా భయపడింది. అయితే అతను మల్లిపట్ల చాలా మంచిగా మసలుకునేవాడు.

ఒకరోజు సాయంత్రం అతను "మల్లీ! నీతో కొంచెం మాట్లాడాలి. కూర్చో!" అన్నాడు.

మల్లి గుండె దడదడలాడింది.

అంతలో అతను "మల్లీ! ఇలా నాలుగిళ్లల్లో పాచి పనులు చేసే బదులు స్వంతంగా ఏదైనా వ్యాపారం చేస్తే బాగుంటుంది కదా! నీ కాళ్ల మీద నీవు నిలబడవచ్చు" అన్నాడు.

ఆ మాటకు ఊపిరి పీల్చుకున్న మల్లి "నేనేం వ్యాపారం చేయగలను బాబూ!" అంది.

"అలా బేలగా మాట్లాడకు. ఈ రోజుల్లో చదువులేని అమ్మాయిలు కూడా టైలరింగ్ చేస్తూ, బేబీకేర్ సెంటర్స్ నడుపుతూ ఎంతో ధైర్యంగా, హుందాగా జీవితం గడుపుతున్నారు. నీకు నేను మార్గం చూపిస్తాను" అన్నాడు.

"అయితే ఏం చేయాలో చెప్పండి" అంది మల్లి.

"నీకు నేను మా బ్యాంకులో లోన్ ఇప్పిస్తాను. ఆ డబ్బుతో ఒక తోపుడు బండి కొనిపిస్తాను. యాపిల్స్, బత్తాయిలువంటి పళ్లు అమ్ముకో. లాభసాటి వ్యాపారం. కొంచెం డబ్బు వెనకవేసావంటే ఆ తరువాత కూరగాయల దుకాణంవంటిది పెట్టుకోవచ్చు" అని చెప్పాడు.

అతను తన పట్ల చూపిన శ్రద్ధకు మల్లి కళ్లల్లో నీళ్ళు తిరిగాయి. తెలీకుండానే రెండు చేతులు జోడించి నమస్కరించింది.

"బాబూగారూ! నాపట్ల నా కన్న తండ్రి కూడా ఇంత శ్రద్ధ తీసుకోలేదు. నాకు దారి చూపిస్తున్నారు. మీ సాయం మరచిపోలేను" అంది.

"మల్లీ! నాకొక చెల్లి ఉంది. నిన్ను చూసిన ప్రతీసారి తనే గుర్తుకొస్తూవుంటుంది. నీకు చేసే సహాయం నా చెల్లికి చేస్తున్నట్లే భావిస్తాను" అన్నాడు జగన్నాథ్.

అతను చెప్పినట్లే మల్లికి బ్యాంక్‌లోన్ ఇప్పించాడు. తోపుడు బండి కొనిపెట్టాడు. ఏ సెంటర్‌లో అయితే వ్యాపారం బాగుంటుందో కూడా సూచించాడు.

అతని ప్రయత్నం ఫలించింది. ఆరు నెలలు తిరిగేసరికి మల్లి ఆ వ్యాపారంలో నిలదొక్కుకుంది.

సారా తాగి కాళ్లు విరగొట్టుకున్న తండ్రికి ఆసరగా నిలిచింది.


తనకంత సహాయం చేసిన జగన్నాథ్‌ని మల్లి మరచిపోలేదు.

ప్రతి గురువారం సాయంత్రం అతనింటికి పని కట్టుకు వెళ్లి వళ్లు ఇచ్చి వచ్చేది.

జగన్నాథ్ నవ్వుతూ "మల్లీ! నేనేం బాబాను కాదు" అనేవాడు. "నాకు మీరే దేవుడు" అనేది మల్లి.

'ఇప్పుడు జీవితం సంతృప్తికరంగానే ఉంది' అని మల్లి సంతోషపడుతూ ఉండగా తాసపడిందా కాలేజీ అమ్మాయి. ఆ అమ్మాయి వయసు కూడా ఇంచుమించు మల్లి వయసే ఉంటుంది.

అయితే ఇద్దరికీ ఎంతో అంతరం. మల్లి చామనఛాయగా ఉంటే ఆ అమ్మాయి పసిడిఛాయతో మెరిసిపోతూ ఉంటుంది. మల్లి చేతికి రబ్బరు గాజులు ఉంటే ఆ అమ్మాయి చేతికి బంగారు గాజులుంటాయి. మల్లి వేసుకున్న బట్టలు వెలిసిపోయి పాతవిగా కనిపిస్తుంటే ఆ అమ్మాయి డ్రెస్ మిల మిల మెరుస్తూ కాంతులీనుతూ ఉంటుంది.



మల్లి కాళ్లకు వేసుకునే చవకరకం చెప్పులు నడుస్తుంటే టపటపమని కొట్టుకుంటూ చప్పుడు చేస్తుంటాయి. ఆ అమ్మాయి వేసుకునే చెప్పులు అందంగా, ఆకర్షణీయంగా కాలికి అంటిపెట్టుకు ఉండి చప్పుడు రానీయవు.

ఆ అమ్మాయి ప్రతిరోజు ఆ జంక్షన్‌లో బస్ దిగి దగ్గరలో ఉన్న కాలేజీకి వెళ్తుంది. మరలా సాయంత్రం వచ్చి అక్కడే బస్ ఎక్కుతుంది.

తొలిసారి ఆ అమ్మాయిని చూసినప్పుడు 'ఎంత అందంగా ఉంది! అచ్చం బుట్ట బొమ్మలా ఉంది' అనుకుంది మల్లి.

ఆ అమ్మాయి ఉదయం బస్‌దిగినప్పుడు చకచకా నడుచుకుంటూ కాలేజీకి వెళ్లిపోయేది.

అప్పుడు మల్లికి ఆ అమ్మాయిని పరిశీలనగా చూడ్డానికి వీలుపడేది కాదు.

కానీ, సాయంత్రంపూట మాత్రం ఆ అమ్మాయి బస్‌కోసం కనీసం పావుగంటసేపు ఎదురు చూసేది. ఒక్కోరోజు అరగంటకూడా పట్టేది. ఆ సమయంలో ఆ అమ్మాయి మల్లి తోపుడుబండికి చాలా చేరువుగా నిలబడేది. ఆ సమయంలో మల్లి ఆ అమ్మాయిని పరిశీలనగా చూస్తుండేది.

అంత అందమైన ఆ అమ్మాయికి ఎంతో అందమైన పేరు ఉండే ఉండాలి అనుకునేది మల్లి. ఒక్కోసారి ఆ అమ్మాయి పేరు తెలుసుకోవాలనిపించేది.

కానీ ధైర్యం చేయలేకపోయేది. అప్పుడప్పుడు ఆ అమ్మాయి దృష్టి మల్లి మీద పడేది.

అప్పుడు మల్లి తడబాటుగా చూపు తిప్పుకునేది. తను గమనిస్తున్నట్లు ఆ అమ్మాయికి తెలియడం మల్లికి ఇష్టం ఉండేది కాదు.

క్రమేపీ మల్లి ఆలోచనల్లో ఆ అమ్మాయి ఒకభాగం అయిపోయింది. అమ్మ, నాన్న చదివిస్తే నేనూ ఆ అమ్మాయిలానే చదువుకునే ఉండేదాన్ని అనుకుంటే మల్లి మనసు తెలియని అసంతృప్తితో నిండిపోయేది. మా అమ్మానాన్న కలిగినవాళ్లయితే నేనూ ఆ అమ్మాయిలానే మంచి డ్రెస్ వేసుకుని, బంగారు నగలతో మెరిసిపోయేదాన్ని అనుకుంటే చాలు మల్లికి జాలా బాధగా అనిపించేది.

రోజులు గడుస్తున్నకొద్దీ మల్లి మనసు బాధతో మెలికలు తిరగసాగింది. మెరుగపడిన జీవితం మల్లికి సంతోషాన్ని ఇవ్వలేకపోయింది.

ఒక్కోసారి మల్లి మనసులోని బాధను, జగన్నాథ్‌కి చెప్పాలనుకునేది. కానీ అతనేం అనుకుంటాడోనని సిగ్గుపడి ఊరుకుంది.

తన మనసులోని బాధ మరచిపోవడానికి ఆ బుట్టబొమ్మవంక చూడకూడదు అనుకునేది గాని చూడకుండా ఉండలేకపోయేది. అది మల్లి బలహీనతగా మారిపోయింది.

ఆదివారం ఆ అమ్మాయి కనిపించకపోతే ఏదో వెలితిగా అనిపించేది.

***

ఒకరోజు సాయంత్రం ఎప్పటిలానే ఆ అమ్మాయి వచ్చి బస్‌కోసం ఎదురు చూడసాగింది. ఆరోజు చాలాసేపటివరకూ బస్ రాలేదు. ఆ అమ్మాయి అయిదు నిమిషాలకోసారి వాచీ చూసుకుంటూ రాని బస్‌కోసం నిరీక్షించసాగింది.

ఆరోజు మల్లికి ఆ అమ్మాయిని పలకరించాలన్న బలమైన కోరిక కలిగింది.

ఆ అమ్మాయి తనవైపు తల తిప్పినప్పుడు "టైం ఎంతయింది" అని మాట కలిపింది.

"అయిదు అయింది" అని చెప్పిందా అమ్మాయి.

మాటకూడా తీయగానే ఉంది అనుకుంది మల్లి.

అయిదు నిమిషాలు ఆగి "నీ పేరేమిటి?" అని అడిగింది మల్లి.

మల్లి తన పేరు అడిగినందుకు మొదట ఆ అమ్మాయి ఆశ్చర్యపోయింది.

నీకెందుకు అన్నట్లు చూసింది. తరువాత ఏం అనుకుందో శిరీష అని చెప్పింది.

ఆ రాత్రి మల్లికి ఒక కల వచ్చింది.

అందులో శిరీష పక్కన మల్లి కూడా ఖరీదైన డ్రెస్ వేసుకుని. మెడలో గొలుసు, చేతులకు బంగారు గాజులు వేసుకుని, భుజానికి పుస్తకాల సంచీ తగిలించుకుని ఉంది.

వాళ్ళిద్దరూ కాలేజీ గురించి, ఫ్రెండ్స్ గురించి చెప్పుకుని నవ్వుకుంటున్నారు.

అంతలో మల్లికి మెలకువ వచ్చింది.



## ఆర్ ది బెస్ట్ అమీషా!

ఈమధ్యనే అమీషా పటేల్ తన ఫ్లాట్‌ని అమ్మేసిందిట. తన బాయ్ ఫ్రెండ్ విక్రమ్‌భట్‌తో తను కలిసి వున్న ఆ ఫ్లాట్ తనకి 'కలిసి' రాలేదని అందుకే ఇద్దరూ దూరమయ్యారని, దీంతో ఆ ఫ్లాట్‌ని అమ్మేయమని కొంతమంది శ్రేయోభిలాషులు ఇచ్చిన సలహామీద ఫ్లాట్‌ని అమ్మేసి మరో చిన్న ఫ్లాట్‌ని కొనుక్కుని అందులోకి అమీషా షిఫ్ట్ అయిందిట. మరి కొత్త ఇల్లయినా కలిసొస్తుందేమోచూడాలి!



ఒకసారి తనకు వచ్చిన కలను గుర్తుచేసుకుని 'నాకు పిచ్చి ముదిరిపోతున్నది.

ఆ తోవుడు బండిని ఆ జంక్షన్ నుంచి మరొక చోటుకి మారిస్తే బాగుంటుంది' అనుకుంది.

ఆ సాయంత్రం శిరీష జీన్స్ వేసింది. అది చూసిన మల్లి 'ఈ బుట్టబొమ్మ ఏ డ్రెస్‌లో అయినా బాగానే ఉంటుంది' అనుకుంది. అంతలో దానికి రాత్రి వచ్చిన కల గుర్తుకు వచ్చింది.

అయితే ఈ రోజు రాత్రి కలలో నేను జీన్స్ వేసుకుంటానన్నమాట అనుకుని నవ్వుకుంది.

అంతలో శిరీష, మల్లి దగ్గరకు వచ్చి "నిన్న నాపేరు అడిగావు. కానీ నీ పేరు చెప్పలేదు" అన్నది.

ఆ అమ్మాయి తనను పలకరించడం మల్లికి ఎంతో సంతోషాన్ని కలిగించింది. "మల్లి" అని చెప్పింది.

"నీలాగే నీ పేరూ బాగుంది" అంది శిరీష.

మొదట ఆ అమ్మాయి ఏం అన్నదో మల్లికి అర్థం కాలేదు. తరువాత ఆ అమ్మాయి తనను అందగత్తె అంటున్నదని అర్థం చేసుకుని బోలెడు సిగ్గుపడింది.

అంతలో బస్ రావడంతో శిరీష బస్ ఎక్కేసింది. 'వెధవ బస్! ఇప్పుడే రావాలా?' అని బాధపడింది మల్లి.

ఆ తరువాత శిరీషకి, మల్లికి మాటలు కలిసాయి. ఇదివరకటిలా ఇప్పుడు శిరీష విసుగ్గా బస్‌కోసం ఎదురు చూడడం లేదు. మల్లితో మాట్లాడుతూ టైంపాస్ చేస్తున్నది. మల్లి సంగతులు అన్నీ తెలుసుకుంది.

ఒకరోజు శిరీష "మల్లీ! నువ్వు ఏం అనుకోనంటే ఒక మాట" అంది.

ఆ అమ్మాయి ఏం అడగబోతున్నదోనని కుతూహలపడిన మల్లి "అడుగు" అంది.

"బాగా ఆకలిగా ఉంది. నా దగ్గర డబ్బులు లేవు. ఒక యాపిల్ ఇస్తావా?" అంది శిరీష.

అది వినగానే మల్లి హృదయం ద్రవించింది. పసిపిల్ల 'ఆకలిగా వుంది' అని తల్లితో చెబితే ఆ తల్లి ఎంతగా తల్లడిల్లుతుందో అలా బాధ పడింది మల్లి.

మరేం మాట్లాడకుండా తన దగ్గరున్న వాటర్ బాటిల్‌లోని నీళ్లతో ఒక యాపిల్ శుభ్రంగా కడిగి ముక్కలు కోసి అందించింది. శిరీష ఆ యాపిల్ ముక్కల్ని గబగబా తినేసింది. ఆ అమ్మాయి మంచి ఆకలి మీద ఉందని అర్థ చేసుకుంది మల్లి.

అంతలో బస్ వచ్చింది.

"థేంక్యూ!" అని మల్లివంక చూస్తూ బస్ ఎక్కేసింది శిరీష. మరుసటి రోజు కలిసినప్పుడు మల్లి యాపిల్‌కోసి శిరీషకు అందించబోయింది.

శిరీష కాసింత సిగ్గుపడుతూ "ఇప్పుడు ఆకలిగా లేదు" అంది.

"మనం ఫ్రెండ్స్. కాదనకూడదు" అంది మల్లి.

శిరీష మరిక కాదనలేదు. స్నేహమయంగా అందుకుని ఎంతో ఇష్టంగా యాపిల్ ముక్కలు తిన్నది. మల్లికి తృప్తిగా అనిపించింది.

కొంచెంసేపటి తరువాత శిరీష చెప్పింది.

"మల్లీ! మమ్మీ ప్రతిరోజూ ఏదో ఒకటి చేసి బాక్స్‌లో పెట్టి ఇస్తుంది. చల్లారిపోయినవి తినాలనిపించదు. డబ్బులు అడిగితే 'నీకేం ఖర్చులు ఉంటాయి?' అని ఇవ్వదు. నాకైతే నిన్ను చూస్తే చాలా సంతోషంగా ఉంటుంది. ఇంత చిన్న వయసులో డబ్బు సంపాదించడమే కాకుండా మీ నాన్నను కూడా పోషిస్తున్నావు. రియల్లీ యూ ఆర్ గ్రేట్!" అని షేక్‌హాండ్ ఇచ్చింది.

మల్లికి, శిరీష ఇంగ్లీష్‌లో ఏమన్నదో అర్థంకాలేదుగాని ఆమె మనసు అర్థం అయింది.


అంతలో బస్ రావడంతో శిరీష వెళ్ళిపోయింది.

చాలాకాలం తరువాత మల్లి సంపూర్ణంగా సంతోషపడింది. మనసుకి గర్వంగా అనిపించింది. శిరీష బుట్టబొమ్మలాంటిది. ఎవరో నడిపిస్తేనే నడుస్తుంది. స్వతంత్రంగా నడవలేదు. కానీ తను బొమ్మకాదు. మనిషి. తను నడవడమేకాదు. మరికొందరిని నడిపిస్తుంది కూడా. ఆ భావం మల్లికి ఎనలేని తృప్తినిచ్చింది.

ఆ రాత్రి మల్లికి ఓ కల వచ్చింది.

ఆ కలలో మల్లి రెక్కలు విప్పుకుని ఆకాశంలో స్వేచ్ఛగా విహరిస్తున్నది. శిరీష మల్లివంకే చూస్తూ నేలమీద పరుగు తీస్తున్నది.

★



## మార్స్ చంద్రుడి విశేషం

చంద్రుడు భూమి చుట్టూ రోజుకొకసారైనా ప్రదక్షిణ చేస్తాడు. అంటే ఒకసారి ఉదయించి అస్తమిస్తాడు. కానీ మార్స్ గ్రహ చంద్రుడు డిమోస్ రోజుకు రెండుసార్లు ఉదయించి అస్తమిస్తాడట!

## రోబో నటన

జపాన్‌లో మిట్సుబిషీ ఇండస్ట్రీవారు ఒక హ్యూమనాయిడ్ రోబోని తయారుచేసి దానికి మొబోకో అని పేరు పెట్టారు. ఒక నాటకంలో మినాకోఇనావే అనే ఆమెతో కలసి ఈ రోబో నటించింది. ప్రపంచంలో డ్రామా యాక్టర్‌గా నటించిన మొట్టమొదటి రోబోగా మొబోకో రికార్డు సృష్టించింది.

-తటవర్తి

